
సాక్షి ఒడిశా

గురువారం । 1 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4.86,182, బంగారం 4.5 గ్రాములు గ్రాములు, వెండి 69.9గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అమ్మాయిలదే టాప్..

- 8లో



ఆణిముత్యానికి ఆర్థికసాయం

- 8లో

న్యూస్‌రీల్

ప్రభుత్వ కార్యదర్శి చిత్ర అర్మగం పర్యటన



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి చిత్ర అర్మగం

పర్లాకిమిడి: జిల్లాలోని మిషన్‌శక్తి, 5టీ స్మార్ట్ తరగతులు, గృహోపకరణాల రంగాల్లో మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని రాష్ట్ర కార్మిక, ప్రభుత్వ పథకాల స్వతంత్ర కార్యదర్శి చిత్రా అర్మగం సూచించారు. జిల్లాలోని గండాహతి పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రాలు, మిషన్‌శక్తి కేఫ్‌లు, కొయిపూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, యూనిఫాం కుట్టు పరిశ్రమలు, పైనాపిల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ లింగరాజ్ పండా, డీఆర్‌డీఏ పడీ రమాంచల్ ఖమారీతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

రాయగడ: స్థానిక సమితి కార్యాలయానికి సమీపంలోని కాళీ మందిరంలో ఈనెల 18న జరిగిన చోరీ ఘటనలో పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు. అరెస్టయిన వారిలో జేకే పూర్‌కు చెందిన బటిక శ్రీను(25), రౌర్‌కళాకు చెందిన అనంత్‌కుమార్ ముదులి(32), విజయనగరానికి చెందిన పెంట కృష్ణ(50) లుగా గుర్తించారు. ఎస్‌డీపీఓ దేవజ్యోతి దాస్, రాయగడ ఐఐసీ కమలాకాంత్ కుహూరా మీడియాకు బుధవారం సాయంత్రం వివరాలను వెల్లడించారు. నిందితుల నుంచి రూ.2,700ల చిల్లర నాణేలను స్వాధీనం చేసుకున్నారు. కాళీ మందిరంలోని హుండీని విరగ్గొట్టి, సుమారు రూ.లక్ష నగదు, వెండి, బంగారు ఆభరణాలు దోచుకున్నట్లు మందిరం సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే నిందితుల నుంచి కేవలం చిల్లర నాణేలు మాత్రమే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తరచూ పట్టణంలో చోటు చేసుకుంటున్న దొంగతనాలను అరికట్టేందుకు పోలీస్ పెట్రోలింగ్ మరింత పెంచుతామని ఎస్‌డీపీఓ మీడియా ప్రతినిధులకు తెలిపారు.

బాణాసంచా పేలి చిన్నారులకు తీవ్రగాయాలు

భువనేశ్వర్: బాణాసంచా పేలుడు ఘటనలో ముగ్గురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ముఖం, ఛాతి, చేతులు తీవ్రంగా కాలిపోయాయి. నగరంలో బుధవారం సాయంత్రం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. గాయపడిన చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. ప్రమాదానికి గురైన వారంతా 10 ఏళ్ల లోపు వారిగా గుర్తించారు. ఉత్సుకతతో పేలని టపాసుని కట్టె పొయ్యిలో వేసి తొంగి చూస్తుండగా అకస్మాతుగా పేలడంతో గాయాల పాలయ్యారు. వీరిని తొలుత బలిపట్న కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో క్యాపిటల్ ఆస్పత్రిలో చేర్చారు.

సింగపూర్ పర్యటనకు సుబలాడ మహిళ



కాంచనకుమారీని అభినందిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల కార్యదర్శి కాంచనకుమారిని రాష్ట్రప్రభుత్వం అధికారిక సింగపూర్ పర్యటనకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆమెకు కలెక్టర్ లింగరాజ్ పండా బుధవారం పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. రాష్ట్రంలోని 10జిల్లాల నుంచి ఒక్కో ఎస్‌హెచ్‌జీ సభ్యురాలికి మాత్రమే అవకాశం రాగా.. అందులో కాంచనకుమారికి చోటు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆర్.ఉదయగిరి సమితి సుబలాడ గ్రామానికి చెందిన మా మంగళా స్వయం సహాయక బృందం సభ్యురాలైన ఆమె.. జూన్ 1న భువనేశ్వర్ నుంచి సింగపూర్‌కు ప్రయాణించనున్నారు. ఈ సందర్భంగా ఆ దేశంలో స్వయం సహాయక సంఘాల పనితీరు, మార్కెటింగ్‌పై అధ్యయనం చేయనున్నారు. కార్యక్రమంలో మిషన్‌శక్తి జిల్లా పీడీ రస్మిరంజన్ శెఠి, డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. జగన్నాథుని కల్యాణోత్సవం

- శ్రీమందిరం ప్రాంగణంలో సందడిగా రుక్మిణీ హరణ ఏకాదశి
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు
- దేవస్నాన మహోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు

భువనేశ్వర్:

పూరీ శ్రీమందిరంలో బుధవారం రుక్మిణి హరణ ఏకాదశి ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఏటా దేవస్నాన పూర్ణిమకు 4రోజుల ముందుగా ఈ ఉత్సవం నిర్వహించడం సంప్రదాయం. ఈ సందర్భంగా జగన్నాథుని కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీమందిరం సింహద్వారం పూల సోయగంతో గుభాలించింది. సింహద్వారం పైభాగంలో కొలువు దీరిన తోరణ మహాలక్ష్మి ప్రత్యేక అలంకారంతో శోభిల్లింది. అంతకుముందు మంగళవారం స్వామివారికి రాజేంద్రాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ప్రాతః దీపారాధన సమయంలో దక్షిణ మండపంలో మదనమోహన అలంకరణ పూర్తిచేసి, రత్న సింహాసనానికి తరలించారు. భోగమండప సేవ పూర్తయి, జగన్నాథుని ఆజ్ఞామాల అందడంతో మదనమోహన్ మంగళ హారతులు అందుకుని జయవిజయ ద్వారం ప్రాంగణానికి వేంచేశారు. ప్రాతః ధూపదీప నైవేద్య సమర్పణ అనంతరం పూజా పండా సామంత సేవకులు జగన్నాథుని ఆజ్ఞామాల శ్రీదేవి రుక్మిణికి సమర్పించి విమానం(పల్లకి)లో మహాజన్ సేవకులు శ్రీమందిరం 7 మెట్ల ఆవరణలో ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి విమానబొడు(పల్లకి మోపరులు) సేవకులు రుక్మిణీ దేవిని ప్రధాన ఆలయ సముదాయంలో ఉన్న మహాలక్ష్మి ఆలయ ప్రాంగణానికి తరలించి అలంకరించారు. మరోవైపు శ్రీమందిరం రత్న సింహాసనంపై జగన్నాథ మూల విరాట్‌కు మహాస్నానం చేయించి, నూతన వస్త్రాలు ధరించారు. సంధ్యా ధూపం అనంతరం జగన్నాథుని కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రుక్మిణీ హరణ ఏకాదశి ప్రత్యేక సేవాదులు పురస్కరించుకుని బుధవారం 4గంటల పాటు భక్తులకు సర్వదర్శనం తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట సాయంత్రం 5 గంటల వరకు సర్వదర్శనం ప్రభావితమైంది.



కల్యాణ వేదికపై వధూవరులు

రుక్మిణి అపహరణ..

శ్రీకృష్ణునితో రుక్మిణి ప్రేమ వ్యవహారాన్ని ఆమె సోదరుడు రుక్మి వ్యతిరేకించి, శిశుపాలుడితో వివాహం చేసేందుకు తలపెట్టడంతో అపహరణ వ్యూహ వృత్తాంతంతో శ్రీమందిరం సముదాయంలో రుక్మిణి హరణ ఉత్సవం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. జగన్నాథుని ప్రతినిధిగా మదనమోహన వ్యూహం ప్రకారం విమలాదేవి పీఠం ప్రాంగణంలో విదర్భా యువరాణి రుక్మిణిని అపహరించడం చూడముచ్చట దృశ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా యుద్ధానికి దిగిన శిశుపాలుడుని పరాజయం పాలు చేసి, రుక్మిణిని పరిణయమాడిన ఘట్టంతో కల్యాణోత్సవం ముగిసింది.



శోభాయమానంగా దర్శనమిస్తున్న తోరణ మహాలక్ష్మి

మరో 3రోజుల్లో

మరో 3రోజుల అనంతరం పవిత్ర దేవస్నాన పౌర్ణమి జరగనుంది. ఈ సందర్భంగా జగన్నాథ దేవస్థానంలో స్నానయాత్ర చేపట్టనున్నారు. దీనికోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. స్నానపౌర్ణమి సందర్భంగా లక్షలాది మంది భక్తులు పోటెత్తుతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మార్కెట్ కూడలి నుంచి మారీచ్ కోట్ వీధి వరకు బారికేడ్లు ఏర్పాటుతో రద్దీ నియంత్రణ చర్యలు చేపడుతున్నారు.



రుక్మిణి అపహరణకు సిద్ధమైన జగన్నాథుని ప్రతినిధి మదన మోహనుడు




విమలాదేవి పీఠం ఆవరణలో స్వామి రాక కోసం నిరీక్షిస్తున్న రుక్మిణి



కల్యాణోత్సవానికి ముస్తాబైన శ్రీమందిరం సింహద్వారం

ప్రయాణం సులభం.. సురక్షితం



ఏసీ బస్సు సర్వీసును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

- సెరొగొడొ–పూరీ ఏసీ బస్సు సర్వీసు ప్రారంభించిన సీఎం నవీన్

భువనేశ్వర్: గంజాం జిల్లా సెరొగొడొ, పూరీ మధ్య జగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సు సేవలను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఒడిశా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఈ బస్సు సర్వీసులను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన సీఎం మాట్లాడుతూ.. కొత్త బస్సు రవాణాతో సెరొగొడొ ప్రాంతీయులు సులభంగా పూరీకి రాకపోకలు సాగించవచ్చని తెలిపారు. ఈ ప్రాంతీయులకు జగన్నాథుని దర్శనం అత్యంత సుఖప్రదంగా లభిస్తుందన్నారు. కార్తీక మాసంలో 'హబీసా' కోసం పూరీకి వెళ్లే గంజాం ప్రజలకు ఈ బస్సు సర్వీసు ప్రత్యేకంగా ఉపయోగపడుతుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. 5టీ పాఠశాల పరివర్తన, దేవాలయ పరివర్తన ఇతరతేర రంగాల్లో గంజాం ఎప్పుడూ ముందుంటుందని ఆనందం వ్యక్తం చేశారు. మా తారా తారిణి ఆలయ పరివర్తన పనులు జిల్లా ప్రజలకు ఆనందం కలిగించాయని పేర్కొన్నారు. అదేవిధంగా, 5టీ ఉన్నత పాఠశాల పరివర్తన కార్యక్రమంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్సాహం తొణికిసలాడిందని వివరించారు.

జాతీయ అవార్డుపై..

ఇదిలా ఉండగా.. పంచాయతీరాజ్ రంగంలో జాతీయ స్థాయిలో ఉత్తమ జిల్లా పరిషత్ అవార్డును గంజాం గెలుచుకుంది. దీనికి కారకులైన వారిని ముఖ్యమంత్రి అభినందించారు. ప్రజల ఆశీస్సులు, సహకారం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో జిల్లా మరెన్నో విజయాలు సాధించగలదని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బరంపురం లోక్‌సభ సభ్యుడు చంద్రశేఖర్ సాహు, కలెక్టర్, ఒడిశా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు, సెరొగొడొ పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

292 కిలోల గంజాయి స్వాధీనం

- ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

బరంపురం: గంజాం, కొరాపుట్ జిల్లాల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో 292కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... కొందమాల్ జిల్లా సరిహద్దు మీదుగా గంజాయి అక్రమంగా రవాణా అవుతున్నట్లు సమాచారం అందిందని ఐఐసీ అధికారి రంజిత్‌కుమార్ ముస్ని తెలిపారు. ఈ మేరకు గంజాం–కొందమాల్ జిల్లాల సరిహద్దు కళింగా ఘాట్ రోడ్డులో వస్తున్న ఆటోని అడ్డుకొని, సోదా చేశారు. అందులో గంజాయి మూటలు బయట పడ్డాయి. దీనిని తూకం వేయగా, 2క్వింటాళ్లు ఉన్నట్లు గుర్తించారు. సరుకును సీజ్ చేసి, ఆటో, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇదే విధంగా గచ్చపడా పోలీసు అధికారులు మరో ప్రాంతంలో దాడి చేసి, 59 కిలోల గంజాయిని సీజ్ చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు.

జయపురం: ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 33 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌కే బారిక్, సిబ్బంది విజయవాడ–రాంచీ 326 జాతీయ రహదారి పాత్రొపుట్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో స్కూటీపై బస్తాలతో ఉన్న వ్యక్తులను గమనించి, తనిఖీ చేశారు. అందులో గంజాయి పట్టుబడటంతో తూకం వేయగా.. 33 కిలోలు ఉందని గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.3,30,000లు ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా నవరంగపూర్ జిల్లా తెంతులికుంతి పోలీసు స్టేషన్ పరిధి దంగ్ర గ్రామానికి చెందిన ప్రదీప్ హరిజన్ కుమారుడు అభయ హరిజన్(21), బొరిగుమ్మ పోలీసు స్టేషన్ పొడాగుడ గ్రామానికి చెందిన సమరు హంతాల్ కుమారుడు రఘునాథ్ హంతాల్(23), మల్కన్‌గిరి జిల్లా జొడి అంబ పీఎస్ తబలగుడ గ్రామానికి చెందిన బిశ్వనాథ్ హంతాల్ కుమారుడు గురుమూర్తి హంతాల్(20)ను అరెస్ట్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేప్టటారు. గంజాయిని మల్కన్‌గిరి జిల్లా జొడియంబ ప్రాంతం నుంచి కొనుగోలు చేసి, ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. నిందితుల నుంచి స్కూటీతో పాటు 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ వివరించారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో గచ్చపడా పోలీసులు



గంజాయితో అరెస్ట్ చేయబడిన నిందితులు

నగర పరిక్రమణకు అమ్మవారు

- ఘనంగా కొనసాగుతున్న బురదల పోలమ్మ ఉత్సవాలు
- రూ.5 లక్షల విరాళం ప్రకటించిన ఎంపీ సప్తగిరి

రాయగడ: గ్రామస్తులు విన్నపం మేరకు కన్నవారి ఇంటి నుంచి సంబరాలు జరుపుకొనేందుకు మెయిన్ రోడ్డు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకున్న గ్రామదేవత బురదల పోలమ్మ.. మంగళవారం కాలి నొప్పులతో విశ్రాంతి తీసుకున్నారు. బుధవారం నగర పరిక్రమణకు ఉపక్రమమిస్తారు. అమ్మవారి ప్రతీకలైన ఘటాలను సాయంత్రం పేరంటాలు తలపై మోసకుంటూ పురవీధుల్లో పర్యటించే కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక జగన్నాథ మందిరం వద్ద ఉన్న కండ్రవీధి, బ్రాహ్మణవీధి, పాయికో, పిట్లవీధి, కాపువీధి డైలీ మార్కెట్ మెయిన్ రోడ్డులో పరిక్రమణ చేశారు. ఘటాలు తిరిగే సమయంలో ప్రజలు ఘటాలు(కుండలో) పళ్లు, బియ్యం వేశారు. గ్రామం అన్ని విధాలా శుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండేలా దీవించమని అమ్మవారికి వీటిని సమర్పించుకుంటారు. పురాతన కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, కుటుంబ సభ్యులు



నగర పరిక్రమణలో ఘటాలు

దర్శించుకున్న ఎంపీ..

గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో సహా వచ్చిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక.. అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించిన ఆయన.. కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అమ్మవారి మందిరం అభివృద్ధి నిమిత్తం తన ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఎంతో ఉత్సాహంగా అమ్మవారి జాతర నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు.

నెక్కంటి ప్రత్యేక పూజలు..

రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో గత ఏడాది అత్యంత ఘనంగా జరిగిన గ్రామదేవత ఉత్సవాలకు.. ఈసారి ఆయన పరోక్షంగా సహకరిస్తూ ఉత్సవాల బాధ్యతను యువతకు అప్పగించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి కుటుంబ సమేతంగా ఉత్సవ వేదిక వద్దకు వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఎంపీ సప్తగిరి ఉలక

రాజావారి భోగాలు..

పండగ 9రోజుల్లో నిత్యం రాజావారి భోగాలు అమ్మవారికి సమర్పిస్తుంటారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న కమిటీ ప్రతినిధులు.. భోగాలను సమర్పించేందుకు ముందుకు వచ్చిన భక్తులకు సహకరిస్తున్నారు. అన్నం, పప్పు, కూరలు, పరమాన్నం ఇష్టంగా భావించే బురదల పోలమ్మకు ఈ సందర్భంగా భక్తులు భోగాలను సమర్పిస్తున్నారు. అలనాటి కాలంలో రాజులు అమ్మవారిని కొలిచిన అనంతరం భోగాలు సమర్పిస్తుండేవారని అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బార్జి జగన్‌మోహన్ నాయుడు, సాధారణ కార్యదర్శి ఎద్దు శ్రీహరి, కోశాధికారి బొత్స శ్రీను తెలిపారు.



అమ్మవారికి భోగాల సమర్పణ

క్లుప్తంగా

229.40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం వేలం



పీడీఎస్ బియ్యం వేలం పాటలో పాల్గొన్న సీఎస్‌డీటీలు

గజపతినగరం: వివిధ రకాల కేసుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ ఆధ్వర్యంలో బుధవారం వేలం వేశారు. ఈ వేలం పాటలో పాంద్రంకి సంతోష్ 229.40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రూ.5లక్షల27వేల620లకు పాడి దక్కించుకున్నట్లు డీటీ రవిశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కోట, దత్తిరాజేరు మండలాల సీఎస్‌డీటీలు ఎన్‌వీవీ ఎస్.మూర్తి, ఆర్.ధనం పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్‌లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే జీఆర్‌పీ ఎస్సై ఫోన్ ద్వారా రైల్వేపార్సిల్ కౌంటర్ ఎదురుగా గుర్తు తెలియని 30 నుంచి 40 ఏళ్ల కలిగిన వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు సమాచారం అందిందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు రైల్వేస్టేషన్‌కు వెళ్లి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువులు ఎవరైనా గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు.

డీఎంహెచ్‌ఓగా భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికా రి (డీఎంహెచ్‌ఓ)గా డాక్టర్ ఎస్.భాస్కరరావు (ఎఫ్‌ఏసీ) నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వేల్ఫేర్ డాక్టర్ వి.రామిరెడ్డి బుధవారం ఉత్తర్వు లు జారీ చేశారు. ఆయన ఆంధ్ర మెడికల్ కాలేజీలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం డీఎంహెచ్‌ఓగా పనిచేసిన డాక్టర్ ఎస్.వి.రమణకుమారి ఉద్యోగ విరమణ పొందారు. ఆమె స్థానంలో భాస్కరావును ప్రభుత్వం నియమించింది.

అమృత్‌సరోవర్ చెరువుల పరిశీలన



లింగంపేట చెరువు పనులు పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న అధికారులు

లక్కవరపుకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో అమృత సరోవర్ పథకం కింద అభివృద్ధి చేస్తున్న చెరువులను రాష్ట్ర బృందం బుధవారం పరిశీలించింది. మండలంలోని కల్లేపల్లి, చందులూరు, లింగంపేట, వీరభద్రపురం గ్రామాల్లో 2021-22 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి చేసిన చెరువులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పైడిరాజు, జిల్లా రీసోర్స్ పర్సన్ (డీఆర్‌పీ) కె.గొంపస్వామి తదితరులు సందర్శించారు. చెరువుగట్టు పటిష్టత, మొక్కలు నాటే తీరు, పెంపకం, చెరువులోకి వచ్చే నీటి సదుపాయం తదితర అంశాలను భౌతికంగా పరిశీలించారు. ఆయకట్టు రైతులతో మాట్లాడారు. పనుల వల్ల ఎంతవరకు ప్రయోజనం ఉందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ రమ్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై నేటి నుంచి వర్క్‌షాప్

విజయనగరం పూల్‌బాగ్: జీ-20 కార్యక్రమాల్లో భాగంగా మహారాష్ట్రలోని పూణే నగరంలో విద్యకు సంబంధించిన వర్కింగ్‌గ్రూప్ సమావేశం కొద్దిరోజుల్లో జరగనుంది. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయం (విజయనగరం)లో జూన్ 1 నుంచి 15 వరకు వివిధ వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నూతన విద్యావిధానం-2020 (ఎన్‌ఈపీ 2020)పై వర్క్‌షాప్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీటింగ్, ఆడియో, వీడియో, స్పోర్ట్స్ ఈవెంట్స్, ర్యాలీలు, క్విజ్, డిబేట్, పెయింటింగ్, ఫిల్మ్ ప్రదర్శన తదితర అంశాలను నిర్వహిస్తామన్నారు.

ముగిసిన ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

విజయనగరం అర్బన్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. బదిలీల మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా బదిలీ ప్రక్రియ చేపట్టారు. బదిలీ స్థానాలతో కూడిన జాబితాలను శాఖల వారీగా విడుదల కానున్నాయి. జిల్లా స్థాయి కేడర్ పోస్టుల బదిలీలు కొలిక్కి వచ్చింది. జోన్ పరిధిలోని పోస్టుల బదిలీలకు ఆ శాఖల ఉన్నతాధికారులు విజయవాడలో చేపట్టిన కసరత్తు కొనసాగింది. కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ, ప్రణాళిక, సర్వే, సహకార శాఖ తదితర విభాగాల పరిధిలో మండల, జిల్లా స్థాయి బదిలీల జాబితాను విడుదల చేస్తామని ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. రెవెన్యూలో వీఆర్వోలు 141మంది, డిప్యూటీ తహసీల్దార్లు 17 మంది, సీనియర్ అసిస్టెంట్లు 26, జూనియర్ అసిస్టెంట్లు 18 మంది బదిలీలకు దరఖాస్తు చేశారు. వీరందరికీ ఎక్కడ పోస్టింగ్‌లు కేటాయించారన్న సమగ్ర వివరాలు గురువారం వెల్లడించే అవకాశం ఉంది.

అమ్మాయిలదే టాప్..

- ప్లస్2 వార్షిక ఫలితాలు వెల్లడించిన విద్యాశాఖ మంత్రి సుధాం మారండి
- సైన్స్‌లో 85.67శాతం, కామర్స్‌లో 83.87శాతం ఉత్తీర్ణత సాధించిన బాలికలు
- రెండు విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచిన నయాగడ్ జిల్లా
- 291 పాఠశాలల్లో శత శాతం ఫలితాలు నమోదు





ప్లస్-2 సైన్స్, కామర్స్ ఫలితాల సంచికను ఆవిష్కరిస్తున్న మంత్రి సుధాం మరాండి

భువనేశ్వర్: రాష్ట్ర ఉన్నత మాధ్యమిక విద్యామండలి వార్షిక హయ్యర్ సెకండరీ(12వ తరగతి) సైన్స్, కామర్స్ విభాగాల పరీక్ష ఫలితాలు బుధవారం ప్రకటించారు. రాష్ట్ర పాఠశాలలు-సామూహిక విద్యావిభాగం మంత్రి సుధాం మారండి ఫలితాల సంచికను ఆవిష్కరించారు. ప్లస్2 ఆర్ట్స్, వృత్తి విద్యా కోర్సు పరీక్షల ఫలితాలు ఈనెల 8న ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మండలి అధికారిక వెబ్‌సైట్లు chseodisha.nic.in, అలాగే orissaresults.nic.in వెబ్‌సైట్‌లో ఫలితాలు పొందవచ్చు. ఈ ఏడాది బాలుర కంటే బాలికల ఉత్తీర్ణత అధికంగా నమోదు కావడం విశేషం. అయితే గత ఏడాది కంటే కామర్స్, సైన్స్ విభాగాల్లో సమగ్ర ఉత్తీర్ణత తక్కువగా నమోదైంది.

సైన్స్‌లో 84.93శాతం..

ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 92,950మంది విద్యార్థులు ప్లస్-2 సైన్స్ విభాగంలో పరీక్షకు హాజరు కాగా.. 78,938మంది ఉత్తీర్ణులయ్యారు. 93,734మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. ఈ విభాగంలో 90,679మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకాగా, 77,468 మంది ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా పరీక్షలు రాసిన 2437మంది ఎక్స్-రెగ్యులర్ విద్యార్థుల్లో 1,470మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణత 85.67 శాతం నమోదు కాగా.. బాలుర 84.28 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 358మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారు. 39,573మంది ప్రథమ శ్రేణిలో, 24,257మంది ద్వితీయ శ్రేణి, 14,852మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 291 పాఠశాలలు శత శాతం ఫలితాలు సాధించడం విశేషం. సైన్స్ విభాగం పరీక్షల్లో 2 పాఠశాలల్లో ఒక్కరు కూడా పాస్ కాలేదు. అత్యధికంగా 96.41శాతం ఉత్తీర్ణతతో నయాగడ్ జిల్లా అగ్రస్థానంలో నిలవగా అత్యల్ప ఉత్తీర్ణతతో గజపతి జిల్లా అట్టడుగు స్థాయికి దిగజారింది. ఈ జిల్లాలో ప్లస్-2 సైన్స్ ఉత్తీర్ణత 61.55 శాతానికి పరిమితమైంది.

కామర్స్‌లో నయాగడ్..

ప్లస్-2 కామర్స్ విభాగంలో పరీక్షలు రాసేందుకు 24,331మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 4,082మంది హాజరయ్యారు. వీరిలో 19,536మంది ఉత్తీర్ణులయ్యారని మంత్రి సుధాం మరాండి తెలిపారు. వాణిజ్య విభాగంలో సమగ్ర ఉత్తీర్ణత 81.12శాతం రికార్డయ్యింది. వాణిజ్య రంగంలో కూడా అబ్బాయిల కంటే అమ్మాయిలే మెరిశారు. 83.87శాతం ఉత్తీర్ణతతో బాలికలు ముందంజలో నిలవగా 79.52శాతం ఉత్తీర్ణతతో బాలురు వెనుకబడ్డారు. ఈ విభాగంలో 102మంది ఉత్తీర్ణులు 90శాతానికి పైగా మార్కులు సాధించారని వెల్లడించారు. పరీక్షలో 7410మంది విద్యార్థులు ప్రథమ, 4,543మంది ద్వితీయ, 7,492మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 94 పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. 1,123మంది అభ్యర్థులు ఎక్స్ రెగ్యులర్ పరీక్షలకు నమోదు చేసుకుని 1,065 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 789మంది ఉత్తీర్ణత సాధించారు. నయాగఢ్ జిల్లాలో కామర్స్ విభాగం ఉత్తీర్ణత అత్యధికంగా నమోదైంది. ఈ జిల్లాలో సమగ్ర ఉత్తీర్ణత 93.9శాతం నమోదు చేసుకోగా, 55.55శాతం ఉత్తీర్ణతతో బౌద్ జిల్లా అట్టడుగున నిలిచింది. జూన్ 10 నుంచి డిజిలాకర్ విధానంలో విద్యార్థుల మార్కుల జాబితా లభ్యం అవుతుందని మంత్రి ప్రకటించారు. మరోవైపు ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గింది. గత ఏడాది(2022) 12వ తరగతి సైన్స్‌లో 94.12 శాతం, కామర్స్ విభాగంలో 89.2శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఆణిముత్యానికి ఆర్థికసాయం



తలపై రాళ్లు మోస్తున్న కర్మా ముదిలి

- బొండా గిరిజన విద్యార్థికి రూ.30 వేలు మంజూరు చేసిన కలెక్టర్



విద్యార్థినిక ఆర్థిక సాయం అందిస్తున్న కలెక్టర్ విశాల్‌సింగ్

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖొయిర్‌పుట్ సమితికి చెందిన బొండా గిరిజన యువతికి రాష్ట్రప్రభుత్వం రూ.30 వేల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని కలెక్టర్ విశాల్‌సింగ్ లబ్ధిదారుకు అందజేశారు. దీనికి సంబంధించి పూర్తి వివారాలు ఇలా ఉన్నాయి. మల్కన్‌గిరి జిల్లా ఖొయిర్‌పుట్ సమితి బోండాఘాటీకి చెందిన కర్మా ముదులి(19) గత ఏడాది ప్లస్2 పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో కామర్స్ టాపర్‌గా నిలిచింది. అప్పట్లో కళాశాల యాజమాన్యం, ప్రభుత్వ సాయంతో భువనేశ్వర్‌లోని రమాదేవి కళాశాలలో ఉచితంగా ప్రవేశం లభించింది. అక్కడ ప్రస్తుతం బీకాం చదువుతున్న విద్యార్థిని.. ఇతర ఖర్చులకు డబ్బుల్లేక పోవడంతో వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చి కూలీ పనులకు వెళ్తోంది. ఈ విషయాన్ని స్థానిక యువత సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. కర్మాను బుధవారం తన కార్యాలయానికి పిలిపించి, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.30 వేలను ఆర్థిక సాయంగా అందించారు. ఇకపై నెలనెలా ఖర్చుల నిమిత్తం సాయం అందిస్తామని, మరిన్ని ఉన్నత చదువులు చదవాలని ప్రోత్సహించారు. కర్మా ముదిలి తల్లిదండ్రులకు ఐదుగురు సంతానం కాగా, వీరిలో నలుగురు అబ్బాయిలు ఉన్నారు. అయితే రెక్కాడితే కానీ.. డొక్కాడని పరిస్థితులు, చదువుపై ఉన్న మమకారంతో తమ్ముళ్ల చదువులకు తానే నడుం బిగించింది. వారి పుస్తకాలు, ఇతర ఖర్చులకు కూలి పనికి వెళ్లగా వచ్చిన మొత్తాన్ని వినియోగిస్తున్నట్లు విద్యార్థిని చెప్పొకొచ్చింది. ఇదిలా ఉండగా.. యువత, కలెక్టర్‌ను చొరవను స్థానికులు అభినందిస్తున్నారు.

ప్రశాంతంగా రథయాత్ర నిర్వహిద్దాం



సమావేశంలో ఎమ్మెల్యే తారాప్రసాద్, అధికారులు

కొరాపుట్: ఈ ఏడాది రథాయాత్ర ప్రశాంతంగా, పరిపూర్ణంగా నిర్వహించేందుకు అంతా సహకరించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సద్భావనా స్వగృహంలో బుధవారం జరిగిన కొరాపుట్ రథాయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో ప్రధానమైన శబరి శ్రీక్షేత్రం జగన్నాథ రథాయాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. యాత్ర సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్ మాట్లాడుతూ జూన్ 19న నేత్రోత్సవం, 20న రథాయాత్ర జరగనుందన్నారు. ఆ ఆరోజు ఉదయం 10 గంటలకు పొహండి, 12.30కి యాత్ర ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. 28న బహుడా(మారు రథాయాత్ర), 29న సునాబెసా, 30న నీలాద్రి విజే నిర్వహిస్తామని ప్రకటించారు. సమావేశంలో విద్యుత్, పోలీసు, తాగునీరు, వైద్య, దేవదాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

బాదంగి: తల్లి మందలించినందుకు మనస్తాపం చెందిన మండలంలోని ఆకులకట్ట గ్రామానికి చెందిన మేకలభవాని (15)ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై ఆర్.జయంతి బుధవారం తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. భవాని గతంలో జరిగిన పదోతరగతి పరీక్షలలో ఉత్తీర్ణురాలు కాలేదని, సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజుచెల్లించి సరిగా చదవడం లేదన్న కోపంతో తల్లి మందలించింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. కుటుంబసభ్యులు గమనించి చికిత్సకోసం విజయనగరం,విశాఖ ప్రభుత్వాస్పత్రులకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి తాత ఫిర్యాదుపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

15 మద్యంబాటిల్స్ పట్టివేత

మండలంలోని గూడెపువలస గ్రామ సమీపంలో వాహనతనిఖీలు చేస్తుండగా కోటిపల్లికి చెందిన సుగ్గరు సత్యనారాయణ 15మద్యంబాటిల్స్ కలిగి ఉండడంతో పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై డి.కొండలరావు చెప్పారు. నిందితుడిపై కేసునమోదుచేసి రిమాండ్ నిమిత్తం బొబ్బిలి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపికైన డాక్టర్ మంచుపల్ల



పార్వతీపురం టౌన్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం వార్షిక వి. రామచంద్రరావు ఉత్తమ రైతు పురస్కారానికి 2023 సంవత్సరానికి గాను పార్వతీపురానికి చెందిన డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు మాస్టారును ఎంపిక చేసినట్లు వ్యవసాయ విద్యాలయ డైరెక్టర్ ఎల్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాన్ని జూన్ 12వ తేదీన విద్యాలయ కాన్వొకేషన్ హాలులో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పురస్కారానికి ఎంపికైనందున జట్టు ఆశ్రమ డైరెక్టర్ డి.పారినాయుడు మంచుపల్లి శ్రీరాములును అభినందించారు.

విజిలెన్స్ దాడులు

విజయనగరం టౌన్:

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం జిల్లాలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని గంట్యాడ మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ సాయి కృష్ణరైతు మిత్రగ్రూప్, శ్రీ గంగమాంబ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాప్, పూసపాటిరేగ మండలంలో రైతు మిత్ర ఎంటర్‌ప్రైజెస్. శ్రీ వేంకట సాయి గణేష్ ట్రేడర్స్‌లో తనిఖీలు చేసి విత్తనాల నిల్వలో తేడాలు లేవని గుర్తించారు. రానున్న ఖరీఫ్ కాలంలో విత్తనాల అమ్మకాల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు రైతులకు తప్పకుండా విత్తనాలు సరఫరా చేయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని షాపుల యజమానులను హెచ్చరించారు. డెంకాడ మండల వ్యవసాయాధికారి పి.నిర్మల, పూసపాటిరేగ మండల వ్యవసాయాధికారి కె.నీలిమ, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

మినీ జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో పరీక్ష రాస్తున్న యువత

పార్వతీపురంటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కుమార్ మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ ఫార్మా, ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 155మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా వారిలో నలుగురు ఎంఎస్‌ఎన్ లాబొరేటరీ కంపెనీలో, 15మంది రెడ్డీస్ ఫార్మాలో ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఎస్వీడీ కళాశాలలో ఇప్పటివరకు ఆరు జాబ్ మేళాలు నిర్వహించి సుమారు 800మంది వరకు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు.

2న చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

- కాలుష్య నియంత్రణ మండలి ఈఈ టి.సుదర్శనం



టి.సుదర్శనం, పర్యావరణ ఇంజినీర్

విజయనగరం రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 2న కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ టి.సుదర్శనం బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని గురజాడ ప్రజా గ్రంథాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. 5వ తరగతి నుంచి 7వ తరగతి, అలాగే 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు రెండు విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్, బీట్ ది ప్లాస్టిక్ పొల్యూషన్ అంశాలపై పోటీలు ఉంటాయని వివరించారు.

వెయిట్ లిఫ్టర్‌కు ప్రోత్సాహక నగదు బహుమతి



పల్లవికి ప్రోత్సాహక నగదు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జూలై 28నుంచి ఆగస్టు 5వరకూ ఢిల్లీలో జరగనున్నాయని, ఆ పోటీల్లో 64 కిలోల సీనియర్ విభాగంలో సత్య కళాశాల విద్యార్థిని సేనాపతి పల్లవి ఎంపికవడం ఆనందంగా ఉందని కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి , కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కళాశాల ఆవరణలో పల్లవిని ప్రోత్సహిస్తూ పౌష్టికాహారం నిమిత్తం ఆమెకు ఆరు నెలలకు సరిపడా రూ.లక్షా 80వేల నగదు అందజేశారు. పల్లవికి మంచి భవిష్యత్తు ఉందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించి, దేశానికి , రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రానున్న పోటీల్లో మరిన్ని పతకాలు సాధించాలని ప్రోత్సహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.సాయిదేవమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోచ్ చల్లారాము తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడులో పురోగతి లేకపోతే చర్యలు

- స్కూళ్ల ప్రారంభం లోగా పనులు పూర్తి కావాలి
- బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలి
- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్

విజయనగరం అర్బన్: పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోగా నాడు నేడు పనులు పూర్తి కావాలని, వచ్చే సమీక్ష సమావేశం నాటికి పనుల్లో పురోగతి కనబడకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ హెచ్చరించారు. టాయిలెట్స్ కిచెన్ షెడ్స్, మేజర్, మైనర్ మరమ్మతులన్నీ వచ్చే పదిరోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంఈఓ, డీఈలు, ఏఈలతో నాడు నేడు పనుల పురోగతిపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. లేబర్, సిమెంట్ లేని చోట పక్క మండలాల నుంచి సర్దుబాటు చేసుకోవాలని, పనులు ఎట్టి పరిస్థితుల్లో ఆగకూడదన్నారు. పనులన్నీ పేరెంట్స్ కమిటీలతోనే జరగాలని స్పష్టం చేశారు. గత సమీక్ష 15 రోజుల క్రితం జరిగిందని ఈ 15 రోజుల్లో కొన్ని మండలాల్లో ఎలాంటి పురోగతి కనబడలేదని ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులను వెంటవెంటనే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఎంఈఓలు ఈ పది రోజుల్లో వారి పరిధిలో ఉన్న పాఠశాలలను సందర్శించి పనుల తీరుపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని పనులు వేగంగా జరిగేలా చూడాలని సూచించారు.

విద్యార్థుల హాజరు కచ్చితంగా ఉండాలి

పాఠశాలల పునః ప్రారంభం తరువాత విద్యార్థుల హాజరు కచ్చితంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే డ్రాప్ అవుట్ వివరాలను కూడా దగ్గర పెట్టుకోవాలని, రెగ్యులర్‌గా బడికి పిల్లలు వచ్చేలా చూసే బాధ్యత టీచర్లదేనని అన్నారు. మధ్యాహ్న భోజనం క్వాలిటీ, మెనూ తప్పనిసరిగా పాటించాలని, తనిఖీల్లో తాను కూడా భోజనం చేస్తానన్నారు. తాగునీరు, టాయిలెట్స్ అన్ని స్కూల్స్‌లో ఉండాలని కోరారు. సబ్జెక్టు టీచర్స్ విద్యార్థులకు క్లాసులు తీసుకునేటప్పుడు వారికి ఆసక్తి కలిగేలా బోధించాలని ఏ తరగతిలోనైనా ఏవిద్యార్థినైనా ర్యాండమ్‌గా చదివిస్తానని విద్యార్థులు చదవలేకపోయినా ప్రశ్నలు చెప్పలేకపోయినా సంబంధిత ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని అన్నారు. 10వ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత చెందేలా మొదటి రోజు నుంచే ప్రణాళికా బద్ధంగా బోధించాలని సూచించారు. వచ్చే ఏడాది ఫలితాలు మెరుగుపడాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఈఓ లింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను వినియోగించొద్దు



ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

- డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వరకు వైద్య సిబ్బందితో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. సిగరెట్టు వద్దు... పౌష్టికాహారం ముద్దు అంటూ నినదించారు. పొగ తాగడం వల్ల, పొగాకు ఉత్పత్తులు తినడం వల్ల ప్రాణాంతకమైన కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. సిగరెట్, చుట్ట తాగడం, ఖైనీ, గుట్కా వంటి వాటి జోలికి పోకూడదన్నారు. పొగ ఎక్కువుగా తాగినవారు చిన్నవయసులోనే చనిపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, డెమో చిన్నతల్లి, డీపీహెచ్ఎన్‌ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో...

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక గంటస్తంభం నుంచి కోట వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు గద్దె చిరంజీవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి మలేరియా నిర్మూలన మాసోత్సవాలు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో భాగంగా జిల్లా మలేరియా నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 30 వరకు మలేరియా నిర్మూలన వారోత్సవాలు జరగనున్నాయని డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8.30 గంటలకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. అన్ని విభాగాధిపతులు, ఆశావర్కర్లు, సిబ్బంది విధిగా హాజరుకావాలని కోరారు.

2న జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 2న శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి పీబీ శ్రీనివాస్ చెప్పారు. ఎచ్చెర్ల ఐటీఐ స్కిల్ హబ్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. 19 నుంచి 30 ఏళ్ల వయస్సువారు అర్హులని తెలిపారు. 16 బహుళజాతి కంపెనీలు హాజరుకానున్నాయని పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి పీజీ విద్యార్హత గల వారు అర్హులని చెప్పారు. అర్హత ఆధారంగా ఉద్యోగాల ఎంపిక ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజిన్ ధ్రువీకరణ పత్రాలుతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్ గానీ, 6301275511, 8317652552, 6301045132 నంబర్లను గానీ సంప్రదించాలని సూచించారు.

వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 3న నిర్వహించాల్సిన ప్లేస్‌మెంట్ అధికారి, బీసీడీఈ కోఆర్డినేటర్ పోస్టుల వాన్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు గమనించాలని కోరారు.

వైభవంగా ముఖలింగేశ్వరుని కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ ఉత్సవం ఘనంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. కొట్నం దంపు కార్యక్రమం ముత్తయిదువులు నిర్వహించారు. ముందుగా స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను చక్కగా అలంకరించి నంది వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటిపై కూలిన విద్యుత్‌స్తంభం



ఇంటిపై పడిన విద్యుత్ స్తంభం

పొందూరు: పెనుబర్తి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సూరమ్మ అనే మహిళ ఇంటిపై విద్యుత్ స్తంభం పడింది. మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం విరిగి ఇంటిపై పడడంతో ఇంటి ముందర రేకులు షెడ్ విరిగిపోయింది. ఇంటిలో ఎవరూ లేకపోవడం ఎలాంటి ప్రమాదం జరగలేదు.

పొగాకుతో ప్రాణానికి ముప్పు

శ్రీకాకుళం రూరల్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ, జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ 60 రోజుల పాటు పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా కార్యాచరణ ప్రకటించారు.

నదిలో పడి వృద్ధుడి మృతి

మందస : మండలంలోని సిరిపురం పంచాయతీ లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన జినగ వెంకటరావు (70) మహేంద్రతనయ నది బ్రిడ్జి నుంచి పడి బుధవారం మరణించాడు. ప్రమాదవశాత్తూ కిందకు పడిపోయాడా.. ఆత్మహత్య చేసుకున్నాడా తెలియడం లేదు. గుర్తు తెలియని వ్యక్తి పడిపోయాడని తెలియడంతో స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరి రక్షించడానికి ప్రయత్నించారు. అప్పటికే వెంకటరావు మరణించినట్టు గుర్తించారు.

కలలు చెదిరెను.. కన్నీరే మిగిలెను

ఆ నవ వధువు కలలన్నీ ఛిద్రమైపోయాయి. ఆ కుటుంబంలోని ఆనందమంతా ఆవిరైపోయింది. చదువు, ఉద్యోగం, వివాహం అంటూ ఒక్కో మెట్టూ ఎక్కుతూ వచ్చిన ఆ యువకుడి జీవితం అక్కడితోనే ముగిసిపోయింది. కొల్లవానిపేట రైల్వేగేటు వద్ద కాపు కాచిన మృత్యుదేవత నవ వరుడిని తనతో తీసు కెళ్లిపోయింది. రెండు నెలల కిందటే వివాహం చేసుకున్న ఆ యువకుడి మృతితో కుటుంబం తల్లడిల్లిపోయింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఫొటోలు తీస్తున్న రైల్వే పోలీసులు (ఇన్‌సెట్లో) మృతుడు సోమేశ్వరరావు (ఫైల్)

- రైలు ఢీకొని ఇంజినీరింగ్ సహాయకుడు మృతి
- కొల్లవానిపేట రైల్వే గేటు వద్ద ప్రమాదం
- మృతునికి రెండు నెలల కిందటే వివాహం

నరసన్నపేట: చక్కగా చదువుకున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. మరో ఉద్యోగినితో వివాహం జరిగింది. ఇక జీవితమంతా హాయిగా కలిసి బతక వచ్చని ఆశ పడిన ఆ వధూవరులపై విధి పగబట్టింది. మృత్యువు దారి కాచి మరీ వరుడిని మింగేసింది. నరసన్నపేట మండలం కామేశ్వరిపేటలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మట్ట సోమేశ్వరరావు (28) కొల్లవానిపేట రైల్వే గేటు వద్ద బుధవారం ఉదయం 10.20 గంటల సమయంలో యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఐదు నిమిషాల్లో కామేశ్వరిపేట చేరుకుంటాడనగా ఈ ప్రమాదం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళంలోని బలగకు చెందిన మట్ట శ్యామలరావు కుమారుడు సోమేశ్వరరావు చక్కగా చదువుకున్నాడు. సచివాలయంలో ఇంజినీరింగ్ సహాయకుడిగా ఉద్యోగం వచ్చింది. మంచి సంబంధం రావడంతో రెండు నెలల కిందటే వివాహం చేశారు. ఆమె కూడా రణస్థలం మండలంలోని సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజూ లాగానే సోమేశ్వరరావు బుధవారం తన బండిపై కామేశ్వరిపేటలోని సచివాలయానికి బయల్దేరాడు. దారిలో కొల్లవానిపేట వద్ద గేటు వేశారు. ఆ తర్వాత జరిగిన నాటకీయ పరిణామాలు సోమేశ్వరరావు ప్రాణాలు తీశాయి.

గేటు లేవడంతోనే..

సరిగ్గా ఉదయం 10.16కు కొల్లవానిపేట గేటు వేసి ఉంది. రెండు వైపులా వాహనాలు నిలిచి ఉన్నాయి. ఆమదాలవలస నుంచి తిలారు వైపునకు గూడ్స్ ట్రైన్ వెళ్లింది. ఆ రైలు వెళ్లగానే గేటు లేచింది. దీంతో కొల్లవానిపేట నుంచి ఒక కారు, ఆటో గేటు లోపలికి వచ్చాయి. సోమేశ్వరరావు కూడా తన బండితో ముందుకు కదిలాడు. అంతే.. అదే ట్రాక్‌పై ఊహించని వేగంతో వచ్చిన యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ సోమేశ్వరరావును అమాంతం ఢీకొట్టింది. ఆ ధాటికి అతడి శరీరం తునాతునకలైంది. రైలు పట్టాలన్నీ రక్తంతో తడిచిపోయాయి. క్యారేజీ, హెల్మెట్ ఇలా ఆయన వస్తువులన్నీ చాలాదూరం ఎగిరిపడ్డాయి. అయితే తమ కళ్ల ముందే ప్రమాదం జరగడంతో గేటు వద్ద ఉన్న వాహనదారులు నిశ్చేష్టులైపోయారు. రెప్పపాటులో తాము ప్రమాదం నుంచి బయటపడ్డామని ప్రత్యక్ష సాక్షులు వేశాల రమేష్, ఆర్.రామకృష్ణ, పుల్లట వెంకటరమణ తెలిపారు. ఆటోలో పది మంది, కారులో నలుగురు ఉన్నారని, వెంట్రుకవాసిలో వీరు ప్రమాదం నుంచి బయటపడ్డారని చెప్పారు.



కన్నీరుమున్నీరవుతున్న మృతుని తల్లిదండ్రులు, అక్క



భార్య జయశ్రీని ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు

కన్నీరుమున్నీరు..

అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు ఇలా దుర్మరణం పాలవ్వడంతో మృతుని తల్లిదండ్రులు శ్యామలరావు, సరస్వతిలు కన్నీరుమున్నీరయ్యారు. అతని సోదరి గౌతమి కూడా తల్లడిల్లిపోయింది. సోమేశ్వరరావు భార్య జయశ్రీ వేదన చూసి అంతా కన్నీరుపెట్టుకున్నారు. నన్ను వదిలి వెళ్లిపోయావా అంటూ ఆమె గుండెలవిసేలా రోదిస్తుంటే ఆపడం ఎవరి తరం కాలేదు.

కేసు నమోదు..

ఈ ప్రమాదంలో సెక్షన్ 174 కింద కేసు నమోదు చేశామని ఆమదాలవలస రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆమదాలవలస స్టేషన్ మాస్టర్ రాజశేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి ఏఎస్ఐ చిట్టిబాబు, హెచ్‌సీ మధుసూదనరావు వచ్చారు. రైల్వేగేట్‌మెన్ మధుపర్ మిశ్రో నుంచి వివరణ తీసుకున్నామని, ప్రమాదవశాత్తు జరిగినట్లు కేసు నమోదు చేశామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోమేశ్వరరావు మృతిపై నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, ఎంపీడీఓ మదుసూదనరావు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మోహనరావు, ఉదయ భాస్కర్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల విభాగం అధ్యక్షుడు ముకుందరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షులు దివ్య, కామేశ్వరిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వాకముళ్ల చక్రదర్, జోగినాయుడులు సంతాపం వ్యక్తం చేశారు.

కర్షకా.. నీకే కానుక



- నేడు రైతుల ఖాతాల్లో ఐదో ఏట తొలి విడత పెట్టుబడి సాయం జమ
- జిల్లాలో 3.16 లక్షలమందికి గాను రూ.236.65 కోట్లు లబ్ధి
- అకాల వర్షాలకు నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6.54లక్షలు అందజేత

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఖరీఫ్ ప్రారంభానికి ముందు కర్షకుడికి ప్రభుత్వం తీపి కబురు అందించింది. వరుసగా ఐదో ఏట తొలి విడత పెట్టుబడి సాయాన్ని గురువారం రైతుల ఖాతాలో జమ చేయనుంది. జిల్లాలో 3.16 లక్షల మందికి గాను రూ.236.65 కోట్లు మేర లబ్ధి చేకూరనుంది. అన్నదాతను ప్రభుత్వం అన్ని వేళలా ఆదుకుంటోంది. ఆర్బీకేల ద్వారా విత్తనాలు అందించడం నుంచి కొనుగోళ్ల వరకు సాయం చేస్తోంది. డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం ప్రకారం ప్రతి రైతుకు ఐదేళ్లలో రూ.67,500 అందించింది. సొంత భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు (సిసిఆర్‌సి పత్రాలు కలిగిన) రైతులకు, (ఆర్‌ఓఎఫ్‌ఆర్) పట్టాలు కలిగిన రైతులకు పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.13500 ఆర్థిక సాయం చేస్తోంది. మొదట విడతగా ఖరీఫ్ పంట వేసే ముందు మే నెలలో రూ.7,500, రెండో విడతగా అక్టోబరులో ఖరీఫ్ పంట కోతకైనా/రబీ పంటల అవసరాలకైనా రూ.4000, మూడో విడతగా ధాన్యం నూర్పుల ఖర్చుల నిమిత్తం రూ.2,000 అందిస్తున్నారు. వాస్తవానికి రైతు భరోసా కింద నాలుగేళ్లే సాయం చేస్తామని ప్రభుత్వం ముందు ప్రకటించింది. కానీ సీఎం వైఎస్ జగన్ మాత్రం రైతులకు ఆర్థిక సాయం అందించాలనే నిశ్చయంతో ఐదో ఏడాది కూడా రైతు భరోసా అందిస్తున్నారు. దీనిలో భాగంగానే గురువారం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిరంలో జిల్లా కార్యక్రమం నిర్వహించనున్నారు.

సంవత్సరం	లబ్ధి పొందిన కుటుంబాలు	లబ్ధి (రూ.కోట్లలో)
2019–20	3,34,057	రూ 450.98
2020–21	3,80,901	రూ 509.04
2021–22	3,78,685	రూ 525.62
2022–23	3,10,346	రూ 393.15
2023–24 (మొదటివిడత)	3,15,554	రూ 236.658

భరోసా కల్పించారు..



నాకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ కింద 0.75 సెంట్ల భూమి ఉంది. వరి, జీడిమామిడి పండిస్తున్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఏటా పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించేవాడిని. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఖరీఫ్ ప్రారంభం నాటికి నా ఖాతాల్లో పెట్టుబడి సాయం అందించి రైతు బతుక్కి భరోసా కల్పిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితకాలం రుణపడి ఉంటాం. – గొర్లె శ్రీనివాసరావు, కొత్తూరు మండలం, దిమిలి గ్రామం, శ్రీకాకుళం జిల్లా.

మహిళా రైతులకు ఊతం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహం మహిళా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. నాకున్న ఎకరా పొలంలో వరితో పాటు అపరాలు, వేరుశనగ వేశాను. అయితే వ్యవసాయం పూర్తిగా వదిలేద్దామన్న సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుభరోసా పేరిట ఆదు కుంది. వ్యవసాయం చేయాలన్న ఉత్సాహాన్ని నింపింది. తరతరాల పాటు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలని రైతులమంతా కోరుతున్నాం. – పైడి వెంకటేశ్వరి, మహిళారైతు, ఎచ్చెర్ల మండలం, కేశవరావుపేట, శ్రీకాకుళం జిల్లా.

ఐదో ఏటా ఇవ్వడం శుభ పరిణామం



నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ రైతుభరోసా పథకాన్ని నాలుగేళ్లు ఇస్తామన్న హామీని ఐదో ఏటా కొనసాగించడం శుభ పరిణామం. రైతులకు ఉపయోగపడే స్కీమ్‌లను అమలు చేయడంతో సీఎం వైఎస్ జగన్‌ను మించిన వారు లేరు. ఖరీఫ్‌కు ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందించడం బాగుంది. – కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి

మలేరియా రహిత సమాజమే లక్ష్యం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

శ్రీకాకుళం/శ్రీకాకుళం రూరల్: రానున్న వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ముఖ్యంగా దోమల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జంపు కృష్ణమోహన్ అన్నారు. జిల్లా మలేరియా కన్సల్టెంట్ ఎల్.శ్రీకాంత్‌తో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని, దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదడువాపు వ్యాధి, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల నుంచి కొంతవరకు రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంఓ శ్రీనివాసరావు, మీడియా లైజినింగ్ అధికారులు పైడి వెంకటరమణ, కింజరాపు రవిప్రసాద్, జి.రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



ఆదిత్యుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవి అమ్మవార్లతో సూర్యనారాయణస్వామి వారి కల్యాణోత్సవం బుధవారం ఉదయం స్థానిక అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ (మత్తత్రయ ఏకాదశి) ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణ ప్రక్రియను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెండి సింహవాహనంలో వేంచింపజేసిన కల్యాణమూర్తుల కల్యాణ సేవలో పలువురు భక్తులు రూ.500 చెల్లించి పాల్గొన్నారు. వీరికి స్వామి వారి శేషవస్త్రాలతో పాటు కల్యాణ తలంబ్రాలను అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఇప్పిలి ఫణీంద్ర శర్మ, బి.నగేష్‌శర్మ, వేదపండితులు పార్థ సారథి, వికాస్ శర్మ పాల్గొన్నారు.

'దరఖాస్తు రీ ఓపెన్ కాకూడదు'



మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నిర్వహిస్తున్న స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. ఆయన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పందనలో పునఃప్రారంభమైన, సంతృప్తికరంగా లేని అర్జీలపై సిబ్బందితో కలిసి సమీక్షించారు. అర్జీదారులకు అధికారులు ఇచ్చి న సమాధానంతో సంతృప్తి చెందనందునే అర్జీ లు రీ ఓపెన్ అవుతున్నాయని, అలా కాకూడ దని తెలిపారు. స్పందన ద్వారా అర్జీదారులు లాభపడాలని, ఈ విషయంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవకులుగానే భావించాలని, కావున ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని సూచించారు. అర్జీలపై తీసుకున్న చర్యలపై ఫొటోలు ఉండాలని, అలాగే అర్జీదారుడు సంతృప్తి చెందినట్లు స్పందన తీసుకోవాలని వివరించారు.

అడిషనల్ ఎస్పీగా తిప్పేస్వామి బాధ్యతల స్వీకరణ



తన చాంబరులో బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ ఎస్పీ జె.తిప్పేస్వామి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖ పరిపాలన అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా జె.తిప్పేస్వామి బుధవారం ఉదయం కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలువురు పోలీసు అధికారులు అడిషనల్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన 1989 సబ్ ఇన్‌స్పెక్టర్స్ బ్యాచ్‌కు చెందినవారు. చిత్తూరు జిల్లాలో ట్రాఫిక్ విభాగం డీఎస్పీగా విధులు నిర్వహించి పదోన్నతిపై జిల్లాకు వచ్చారు.

ఎంఎల్ఎస్ పాయింట్ అక్రమాలపై విచారణ

కొత్తూరు: కొత్తూరు మండల స్థాయి స్టాక్ పాయింట్ (గోదాం) లో గత ఏడాది జరిగిన అక్రమాలపై సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం విచారణ నిర్వహించారు. ఈ అక్రమాలపై అప్పట్లో పోలీసు కేసు నమోదైంది. సుమారు 198 మెట్రిక్ టన్నుల బియ్యం, పంచదారతో పాటు పలు నిత్యావసరాలకు సంబంధించిన రికార్డులను సబ్ కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అప్పట్లో గోదాం తనిఖీ చేసి వారిని పిలిపించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న సరుకులను పరిశీలించారు. దీనికి సంబంధించి సీజ్ చేసిన కొన్ని పుస్తకాలను ఎస్ఐ మురపాక గోవింద్ సబ్ కలెక్టర్‌కు అందించారు. ఇంకా పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సి ఉందని సబ్ కలెక్టర్ తెలిపారు. అనంతరం కుంటిభద్ర కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వివాదంలో ఉన్న స్థలాన్ని జెడ్పీటీసీ కామక భాగ్యతి వినతి మేరకు సబ్ కలెక్టర్ పరిశీలించారు.

త్వరగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) రాష్ట్ర చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను బుధవారం సందర్శించారు. మౌలిక వసతుల కల్పన, భవన నిర్మాణాల పరిస్థితి, అకడమిక్, పరిపాలన వ్యవహారాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తరగతి గదులు, వసతి గృహాలను విద్యార్థులకు సరిపడా సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. రన్నింగ్ వాటర్ సౌకర్యం, తాగునీరు, డ్రైనేజ్ వ్యవస్థ వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగు వేల మంది విద్యార్థుల సామర్థ్యం స్థానికంగా ఉండగా, మరికొన్ని నెలల్లో భవనాలు పూర్తయితే ఐదు వేల మంది విద్యార్థులకు వసతి సిద్ధమవుతుందని చెప్పారు. 2024 నాటికి ఆరు వేల మంది విద్యార్థులకు వసతి, అకడమిక్ సౌకర్యాలు కల్పనపై దృష్టి పెట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, ఇంజినీరింగ్ అధికారులు తేజ్‌కిరణ్, సురేష్, పీఆర్‌ఓ మామిడి షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశయన సంఘం అధ్యక్షుల ఎన్నిక



నూతన అధ్యక్షులతో సంఘు ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీశయన సంఘం కేంద్ర అధ్యక్షునిగా వంగా మహేష్, రాష్ట్ర అధ్యక్షునిగా లోడ అప్పారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాకుళం నగరంలో ఎన్జీవో హోమ్‌లో బుధవారం జిల్లా శ్రీశయన సంఘు అధ్యక్షుడు మండల మన్మధరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రాష్ట్ర, కేంద్ర శ్రీశయన సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీశయన సంఘం పెద్దలు కిల్లి గోపాలం, రుప్ప రాంబాబు, బొంగు రాంబాబు, పట్నాల వెంకటేష్ బాబు, కోల శ్రీరాములు, కోల బలరాం, జిల్లా సంఘం పెద్దలు డి.పి.దేవ్, గుజ్జల శాంతమూర్తి, ఇర్రి ఆదినారాయణ, కర్రి రంగాజీదేవ్, బంటుపల్లి రాజశేఖర్, పోలాకి చిన్నారావు, బాణాల కృష్ణారావు, జాక శ్యామ్, ఇర్రి అచ్చెన్న, దేవాడ మోహనరావు, సిందిరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సమాచార శాఖ డీడీ



డిప్యూటీ డైరెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర సమాచార శాఖ (ఐఅండ్‌పీఆర్) డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.రామచంద్రమూర్తి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి ప్రత్యేక దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి షణ్ముఖశర్మ, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, డీపీఆర్‌వో సిబ్బంది పాల్గొన్నారు.







గేటు వేసినా ఆగరే..

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పరిధిలోని రైల్వే గేటు వద్ద కొందరు ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నారు. జంట పట్టణాలకు చెందిన అత్యధిక ప్రయాణికులు ఈ రైలు పట్టాలపై రాకపోకలు జరుపుతుండటంతో ప్రమాదకరంగా మారింది.

–కాశీబుగ్గ



కాశీబుగ్గ: గేటు వేసినా దాటుతున్న వాహనదారులు